RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్


దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 249 | సెప్టెంబర్ 03, 2025 | వెల : రూ.3-00



**కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదు**

4లో..




# ఇక మనల్ని ఎవరూ ఆపలేరు



- భారత్‌పై ప్రపంచ దేశాలకు పెరిగిన నమ్మకం
- వృద్ధిరేటుపై ప్రధాని మోడీ
- పీఎంకు తొలి మేకిన్ ఇండియా మైక్రో ప్రాసెసర్ చిప్

**వేద న్యూస్, డెస్క్:**

భారత్ లో తయారయ్యే చిన్న చిప్ లను ప్రపంచ వ్యాప్తంగా భారీ మార్పును తీసుకొచ్చే రోజులు అతి త్వరలోనే రానున్నాయని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సెమి కండక్టర్ రంగాన్ని ఆలస్యంగా ప్రారభించిన భారత్ ను ఏ దేశం ఆపలేకపోతుందని ఆయన చెప్పారు. ఢిల్లీలో సెమికాన్–ఇండియా సదస్సును ప్రధాని మోదీ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ప్రధాని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత్ మాత్రం స్థిరంగా వృద్ధి రేటు సాధించిందని అన్నారు. అందుకు ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాలే నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. సదస్సులో 40 దేశాల ప్రతినిధులు పాల్గొనడం సంతోషకరమని భారత్ ఆవిష్కరణలు, యువ శక్తి కూడా సదస్సులో ఉందన్నారు. ప్రపంచ దేశాలకు భారత్‌పై నమ్మకం పెరిగింది. పోటీ పెరిగిన తరుణంలోనూ భారత్‌కు ఆదరణ తగ్గలేదన్నారు. సెమీ కండక్టర్ల రంగంలో ప్రపంచ దేశాలు భారత్‌తో కలిసి వస్తున్నాయి. ఆత్మనిర్భర్ భారత్ యాత్రలో దేశానికి కీలక భాగస్వాములున్నారు. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో భారత్ జీడీపీ గణనీయ వృద్ధి సాధించిందని ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం ఉన్నా, భారత్ పురోభివృద్ధి సాధిస్తోందని తెలిపారు.

ఆర్థిక మందగమనంలోనూ భారత్ 7.8 శాతం వృద్ధిరేటు సాధించిందని తాము పెట్టుబడుదారులను స్వాగతించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రధాని స్పష్టం చేశారు. డిజైన్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా, ట్రస్టెడ్ బై ది వరల్డ్ అనే పేరు

మిగతా 3వ పేజీలో..






## బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెండ్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రంగా పరిగణిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శులు సోమ భరత్ కుమార్, టి. రవీందర్ రావు పేరిట ప్రకటన విడుదల అయ్యింది. ఇటీవల కాలంలో కవిత ప్రవర్తిస్తున్న తీరు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు బీఆర్ఎస్ కి నష్టం కలిగించేలా ఉన్నాయని, అధిష్ఠానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తోందని లేఖలో పేర్కొన్నారు. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కాగా సోమవారం కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత స్పందించారు. ఎవరి వల్ల, ఎందుకోసం మాజీ సీఎం కేసీఆర్ కు అవినీతి మరక అంటిందో గుర్తించాలని ఆమె సూచించారు. కాళేశ్వరం విషయంలో ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్ రావు పాత్ర లేదా అంటూ ఆమె ప్రశ్నించారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలి

**వేద న్యూస్,హన్మకొండ:**



వైద్య సేవల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలను అందించాలని హనుమ కొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమ కొండ వడ్డేపల్లి లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా న్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా ఓపి, గర్భిణీలు, బాలింతలకు సంబంధించిన రికార్డులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. సరిపోల్చి చూసిన అనంతరం రికార్డులలో సమగ్ర వివరాలు నమోదు చేయకపోవడంపై సిబ్బందిని కలెక్టర్ మందలించారు. ఆరోగ్య కేంద్రంలోని పలు విభాగాలను సందర్శించి వాటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆరా తీయగా తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ కు ల్యాబ్ టెక్నీషియన్ డిప్యూటేషన్ పై పంపించినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య కలెక్టర్ కు తెలియజేశారు. పేషెంట్స్ కు వైద్య పరీక్షలను ఎలా నిర్వహిస్తున్నారని కలెక్టర్ అడగగా వారంలో రెండు రోజులపాటు ( సోమ, శుక్రవారాలు) స్టాఫ్ నర్స్ ద్వారా రక్త నమూనాలను సేకరించి వాటిని తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ కు పంపిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వివరణ ఇచ్చారు. అదేవిధంగా వడ్డేపల్లిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిర్మిస్తున్న శాశ్వత భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనులు పూర్తి చేయడానికి ఇంకెంత సమయం పడుతుందని కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, వడ్డేపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాలిక, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంధకారంలో అంగన్వాడి కేంద్రాలు..!

**వేద న్యూస్,కొనరావుపేట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాలు విద్యుత్ సౌకర్యం లేకుండానే నడుస్తున్నాయి. గ్రామంలో ఉన్న రెండు కేంద్రాలలో కూడ ఇదే సమస్య. ఇది మౌలిక సదుపాయాల కొరతను సూచిస్తుంది. అంగన్వాడి కేంద్రాలలో విద్యుత్ లేకపోవడం వల్ల ఫ్యాన్లు లేక, ఉక్కపోత, దోమల మధ్య పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ట్యూబ్ లైట్ లేకపోవడంతో పిల్లలు చీకటి గదిలో కూర్చునే పరిస్థితి ఏర్పడింది. కావున ఇప్పటికైనా కొనరావుపేట మండల సంబంధిత అధికారులు అంగన్వాడి కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజలు, పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## మహబూబాబాద్ లో మెడికల్, నర్సింగ్ కాలేజీలు ప్రారంభం

- రూ.186 కోట్ల వ్యయంతో నిర్మాణం

**వేద న్యూస్, మహబూబాబాద్ :**



మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో మంగళవారం సుమారు 186 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించబడిన మెడికల్, నర్సింగ్ కాలేజీలతో పాటు 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, బాలుర–బాలికల హాస్టల్ ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్, పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.ప్రారంభోత్సవం అనంతరం మంత్రులు మూడవ సంవత్సరం చదువుతున్న దమయంతి, స్వాతి, ప్రకాశ్ పాండే, మైదేహి వర్మ, అనీషా, యతేశం తదితర వైద్య విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి అనుభవాలు, అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ, పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగుతోందని చెప్పారు. జిల్లాకు ఇప్పటికే 18 టన్నుల యూరియా చేరిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరింత కోటా సాధించేందుకు మంత్రివర్గం త్వరలో ఢిల్లీకి వెళ్లనుందని వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ బలోపేతానికి పదోన్నతులు కల్పించి, అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



సిరిసిల్ల పట్టణ పరిధిలోని కల్యాణ లక్ష్మీ ఫంక్షన్ హాల్లో వికాస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన విద్యార్థులకు స్వాగతం చెప్పే కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్నా జిల్లా ఎస్పీ. ఈసందర్భంగాఎస్పీ మాట్లాడుతూ...సైబర్ నేరాల బారిన పడుతున్న వారిలో యువత ఎక్కువ సంఖ్యలో ఉన్నారని,చారవణిలో ఆకట్టుకునే ప్రకటనలు చూసి అత్యాశకు పోయి సైబర్ మోసగాళ్లో వలలో చిక్కుకోవద్దన్నారు. విద్యార్థులలో సైబర్ నెరలపై చైతన్యం తీసుకరవలనే ఉద్దేశ్యంతో జిల్లాలోని విద్యాసంస్థలలో సైబర్ వారియర్ల చేత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియను వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని తెలిపారు.సైబర్ నేరానికి గురైనప్పుడు వెంటనే 1930 కి కాల్ చేసి పిర్యాదు చేయాలని భయపడవద్దని తెలిపారు. విద్యార్థులకు లోన్ యాప్స్, షేర్ మార్కెట్, ఏపీకే

మిగతా 2వ పేజీలో..

వేద న్యూస్

బుధవారం సెప్టెంబర్ 03, 2025

# బీఆర్ఎస్ నాయకుల నిరసన



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ మండల నాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద రివర్స్ పంపింగ్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంపై ఘోష్ కమిషన్ తప్పుడు నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ జరపడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు. అపర భగీరథుడు బీడు భూములను తడిపిన కెసిఆర్ తెలంగాణ వరప్రదయిని అని అన్నారు. కాళేశ్వరాన్ని విఫలయత్నంగా చూపించి గోదావరి జలాలను ఆంధ్రకు తరలించేందుకు రేవంత్ చేస్తున్న కుట్రలకు నిరసన చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నలుమూలలకు నీళ్లు ఇచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలని ఆలోచన చేసి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసిన కెసిఆర్‌ను బద్నాం చేయాలనే దురుద్దేశంతో చేస్తున్న ప్రయత్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# 51 రకాల పిండి వంటలతో నైవేద్యం




**వేద న్యూస్,మడికొండ :**

మడికొండ నెహ్రూనగర్ లో శ్రీ వర సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో ప్రధమ గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని మట్టి గణపతి నెలకొల్పారు. నిత్యం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహిస్తూ ఆరవ రోజు సోమవారం రాత్రి స్వామివారికి 51 రకాల పిండి వంటకాలతో నైవేద్యం తయారుచేసి మహానివేదన చేశారు.అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించి, లక్ష్మీ సహస్ర పారాయణం, మణిద్వీప వర్ణనల పారాయణాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు పాక విజయలక్ష్మి, బుర్ర స్వప్న, తొడుపునూరి లక్ష్మి, లావణ్య, రాజేశ్వరి, రావికంటి వాసవి, చిర్ర శ్రీలత, దీప్తి, సబితా, పద్మ, విజయలక్ష్మి, గీతాదేవి, ఆలకుంట సమ్మక్క, ప్రియాంక, రమ, కాలనీ కమిటీ సభ్యులు సారంగపాణి, రమేష్, రాకేష్, చిర్ర రమేష్ గౌడ్, రాజకుమార్, మోహన్, భక్తులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా దీపారాధన

వేద న్యూస్, కమలాపూర్ : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని విశ్వ సాయి యూత్ ఆధ్వర్యంలో వినాయకుడిని ప్రతిష్టించగా అందులో భాగంగానే గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దీపారాధన కార్యక్రమాన్ని గణపతి భక్తులైన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఈ దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, భక్తితో కోరిన కోరికలు తప్పక తీరుస్తాడని నమ్మకంతో ఈ కార్యక్రమం ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ దీపారాధన కార్యక్రమంలో గణపతి భక్తులైన మహిళలు లత, రమ, కళ్యాణి, వరలక్ష్మి, సుమలత, విజయ, సంగీత, లలిత, సరిత, సరళ, పుష్ప, లావణ్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.



# ఆలయంలో ఈవో ఆకస్మిక తనిఖీలు



**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ఈవో ఎల్. రమాదేవి ఆలయంలోని పలు విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా సెంట్రల్ గోదాం, లడ్డు ప్రసాద కౌంటర్, ప్రధాన బుకింగ్ కౌంటర్‌తో కళ్యాణ కట్ట పాటు నూతనంగా ఏర్పాటు చేసిన స్వామివారి నిత్య కళ్యాణం, చండీ హెూమం,సత్యనారాయణ వ్రతం నిర్వహించే ప్రదేశాలను మరియు ఆలయ పరిశుభ్రతను జాగ్రత్తగా సమీక్షించారు.గోదాంలోని రికార్డులు, వస్తువులను సమగ్రంగా పరిశీలించిన ఈవో రమాదేవి ఆలయ పరిపాలనా సరళత, ఆస్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను సిబ్బందికి అందించారు.ఈవో రమాదేవి మాట్లాడుతూ, ఆలయ సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి కొనసాగిస్తామని తెలిపారు.

# ఎన్సిసి శిక్షణ శిబిరం ప్రారంభం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

మామునూర్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో ఏక్ బారత్ శ్రేష్ఠ భారత్-(1) 12 రోజుల ఎన్సిసి 10వ తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రారంభమైనట్లు క్యాంపు డిప్యూటీ కమాండెట్ కల్నల్ ఎస్ ఎస్ రామదురై తెలిపారు. జాతీయ సమైక్యతకు, వివిధ జాతుల సమ్మేళనం కలబోసి, సంస్కృతి సాంప్రదాయాలు, దేశ అభివృద్ధి, భారతీయ ఆచార కట్టుబాట్లు పంచుకుని మనందరం భారతీయులమని సందేశం ఇవ్వడమే ఈ క్యాంపు ముఖ్య ఉద్దేశమని. ఈ క్యాంపు కమాండెంట్ గా వరంగల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ అన్నారావు నిమ్బాకర్., వీర చక్ర ఆధ్వర్యంలో జరుగుతున్నది. మూడు రాష్ట్రాల నుండి 600 కడేట్స్ పాల్గొంటున్నట్లు తెలిపారు. బీహార్, జార?ండ్, తెలంగాణ రాష్ట్రం నుండి వీరు పాల్గొంటున్నట్లు జాతీయ సమైక్యత, ఒకరి సంప్రదాయాలు మరొకరు గౌరవించడం, అన్ని రాష్ట్రాల వాళ్ళు కలిసి ఒకే వేదిక పై అందరం భారతీయులమని సమాచారాన్ని ,సమైక్య స్ఫూర్తితో చేయి చేయి కలిపి ఒక గొప్ప యువ సమ్మేళనమే భవిష్యత్ భారత దేశ సమైక్యతకు ఈ క్యాంపు ఎంతో దోహదపడుతుందని డిప్యూటీ క్యాంపు కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై తెలిపారు. 3 సెప్టెంబర్ పోలీస్ శిక్షణ కళాశాలలో ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు మూడు రాష్ట్రాల కడైట్స్ ఉద్దేశించి ప్రసంగిస్తారు గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ అన్నరావు నిమ్బాల్ కర్, వీర చక్ర. ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్ 12 రోజులకు , మొదటి రోజు రైల్వే స్టేషన్ నుండి పి. టీ. సీ.తరలించి వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి బారక్లో వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారిగా లెఫ్టినెంట్ కల్నల్ రవి సునరే, కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, ఎన్సిసి ఆఫీసర్ దూడల వెంకటేష్, ఎస్ఎం జై రామ్ సింగ్, సూపర్ ఇండెంట్ అరుణ, జె సి ఓ ఖదం, సౌరస్య, సుతార్, సందీప్పాటిల్, సందీప్, నిఖిలేష్, సాజన, కుమారస్వామి, సతీష్, సుధా, మహేశ్ , శిక్షణ అధికారులు , వివిధ రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు.



# రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**వేద న్యూస్, సికింద్రాబాద్ :**



రైల్వే కార్మికుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ సెక్రెటరీ పిల్లలమర్రి రవీందర్, అధ్యక్షుడు కాజా బాబు లు సికింద్రాబాద్ రైల్వే డివిజన్ అధికారిని కోరారు. సికింద్రాబాద్ డివిజన్ కార్యాలయంలో డీఆర్ఎం గోపాల కృష్ణన్ ను మజ్దూరు యూనియన్ నాయకులు కలిసి వినతి పత్రం అందించారు. రైల్వే కార్మికులకు రావలసిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని లేఖలో కోరారు. డీఆర్ఎం ను కలిసిన వారిలో అసిస్టెంట్ డివిజనల్ సెక్రెటరీ, సిసిఎస్ అధ్యక్షులు చిలుకు స్వామి, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు బచ్చలి శ్రీనివాస్, వివిధ బ్రాంచ్ సెక్రెటరీ లు యుగంధర్ యాదవ్, సమయ్య, సంపత్, అంజియాదవ్,బాలముని, ఢిల్లీ రావు, చైర్మన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

**వేద న్యూస్,శాయంపేట:**



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు తీవ్ర నిరసనగా శాయంపేట మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి, నాయకులు, కార్యకర్తలు గట్టిగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ , రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఇలాంటి మహానేతపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చేసే విమర్శలు, వ్యక్తిగత దూషణలు తీవ్రంగా ఖండిస్తున్నామని రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య పరిమితులను దాటి, ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయి. దేశాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలు మేము సహించము అని మండిపడ్డారు.ప్రధానమంత్రి గౌరవాన్ని కాపాడే దిశగా, కాంగ్రెస్ పార్టీ తప్పుదారి పట్టించే రాజకీయాలను నిలువరించే దిశగా బీజేపీ ఉద్యమం కొనసాగుతుంది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు,మండల ఉపాధ్యక్షులు కోమటి రాజశేఖర్, పోల్ మహేందర్, మండల ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి,మండల కార్యదర్శిలు మేకల సుమన్, జొన్నొత్తుల జీవన్ రెడ్డి, భూత్ అధ్యక్షులు కడారి చంద్రమౌళి, బాసని నవీన్, ముల్కనూరి వెంకటేష్,గొండ శ్రీనివాస్, నాతి విద్యాసాగర్, పున్నం సాంబయ్య, ఎర్ర తిరుపతిరెడ్డి, కొంగరి సుధాకర్, కన్నెబోయిన రమేష్,రాజోజు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఫైల్స్, కొరియర్ ,క్రెడిట్ కార్డ్,మ్యాట్రి మోని,లాటరీ గిఫ్ట్,మల్టీ లెవల్ మార్కెటింగ్ ,క్రిప్టో కరెన్సీ, డిజిటల్ అరెస్ట్, లాటరీ ఫ్రాడ్, గిఫ్ట్ ఫ్రాడ్ సోషల్ మీడియా తదితర మోసలపై విద్యార్థులకు జిల్లా సైబర్ సెల్ టీమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్ తొలి దశలోనే కట్టడి చేయాలని,ర్యాగింగ్ కి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కళాశాల యాజమాన్యం ఎప్పటికప్పుడు విద్యార్థుల నడవడికను గకనిస్తూ ఉండాలని తెలిపారు.కళాశాల ఆవరణలో సీనియర్స్-జూనియర్స్ అనే తేడాలు లేకుండా స్నేహపూర్వకంగా చదువు కొనసాగించాలని ర్యాగింగ్ కు దూరంగా ఉంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానంలో స్థిరపడి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల లకు అలవాటుపడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని,గంజాయి రహిత జిల్లాగా మర్చడంలో విద్యార్థులు కూడా భాగస్వామ్యం కావాలని,గంజాయి లాంటి మత్తుపదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్ వారికి అందివ్వాలని తెలిపారు. విద్యార్థులు చేడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుని,కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు.ఈకార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ కృష్ణ, సైబర్ సెల్ ఆర్.ఎస్.ఐ జునైద్, కళశాల ప్రిన్సిపాల్ జగన్, కళశాల యాజమాన్యం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి


**- నివాళులర్పించిన బోయినిపల్లి కాంగ్రెస్ శ్రేణులు**

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైయస్ రాజశేఖర్ రెడ్డి, చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. రైతును రాజుగా చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను వైయస్ రాజశేఖర్ రెడ్డి, ప్రవేశపెట్టాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ఇక మనల్ని ఎవరూ ఆపలేరు



త్వరలో ప్రపంచానికి వినిపిస్తుంది ప్రధాని అన్నారు.


ఇక భారత్ మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించేదిశగా వేగంగా సాగుతోందని అన్నారు. సెమి కండక్టర్ రంగంలో ఒకమాట చెబుతారు. చమురు నల్ల బంగారమైతే చిప్ డిజిటల్ డైమండ్. గడిచిన శతాబ్దానికి చమురు రూపమిచ్చింది. చమురు నుంచి వచ్చే పెట్రోల్ ఆధారంగా ప్రపంచ ఆర్థికవ్యవస్థ హెచ్చుతగ్గులకు గురయ్యేది. కానీ 21వ శతాబ్దం శక్తి చిన్నపాటి చిప్‌లో ఇమిడిపోయింది. చిప్ చిన్నదే అయినా అందులో ప్రపంచ ప్రగతికి భారీ వేగాన్ని అందించే శక్తి ఉంది. నేడు సెమి కండక్టర్ ప్రపంచ మార్కెట్ విలువ 600బిలియన్ డాలర్లకు చేరింది. రాబోయే కొన్నేళ్లలో ట్రిలియన్ డాలర్లను అధిగమించనుంది. భారత్ వేగంగా సెమికండక్టర్ రంగంలో ముందుకు సాగుతున్నతీరు చూస్తే ట్రిలియన్ డాలర్ల మార్కెట్ షేర్‌లో భారత్ వాటా ఎక్కువగా ఉండనుందనే నమ్మకం ఉంది ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

– ప్రధాని మోదీకి తొలి మేకిన్ ఇండియా మైక్రో ప్రాసెసర్ చిప్

ఢిల్లీ లో సెమీకాన్ ఇండియా సదస్సు–2025లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తొలి 'మేకిన్ ఇండియా మైక్రో ప్రాసెసర్ చిప్' లను ప్రధాని మోదీకి అందించారు. విక్రమ్ 32 బిట్ ప్రాసెసర్, టెస్ట్ చిప్స్‌ను ఇస్రో సెమీకండక్టర్ ల్యాబ్ అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వాహకనౌకల్లో కఠిన వాతావరణ పరిస్థితుల్లోనూ పనిచేసేలా చిప్ రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. సెమీకండక్టర్ ఎకోసిస్టమ్ పెంపొందించడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కొన్నేళ్ల క్రితం ప్రధాని దూరదృష్టితో ఆలోచించి దీనిని ప్రారంభించారని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దీంతో కేవలం మూడున్నర సంవత్సరాల వ్యవధిలో ప్రపంచదేశాలు భారతదేశం వైపు నమ్మకంగా చూస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో ఐదు సెమీకండక్టర్ యూనిట్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, జితిన్ ప్రసాద, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ను కలిసిన రాజన్న ఆలయ నూతన ఈవో

**వేద న్యూస్, వేములవాడ:**



శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం (వేములవాడ)కు ఇటీవల నియమితులైన నూతన కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి, మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌ను వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించిన లడ్డు ప్రసాదం మరియు స్వామివారి కండువాను ఎమ్మెల్యేకు అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన రమాదేవికి శుభాకాంక్షలు తెలుపుతూ, ఆలయ పరిపాలనలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాలు, భక్తుల సౌకర్యాల మెరుగుదలపై చర్చలు జరగాయి. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పట్ల తన పూర్తి చిత్తశుద్ధిని వ్యక్తపరుస్తూ, అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించేందుకు తాను సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయండి

**వేద న్యూస్,వరంగల్:**

జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్లో కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, జి డబ్ల్యు ఎం సి కమిషనర్ చాహత్ బాజ్పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇన్నర్ రింగ్ రోడ్ భూసేకరణ పురోగతి, గుండు చెరువు, ఖిలా వరంగల్,నిర్వాసితులకు పరిహారం,చెల్లింపు,పర్యాటక ప్రదేశంగా ఉరుసుగుట్ట అభివృద్ధి,కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో గ్రీనరీ, చెరువులకు ఎఫ్టిఎల్ ల ఏర్పాటు తదితర అంశాల పురోగతిని సమీక్షించి సమర్థ నిర్వహణకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. కుడా చైర్మన్ ఇనగల వెంకట్రాం రెడ్డితో కలిసి గతంలో పలుమార్లు సందర్శించి ఏకవీరదేవి దేవాలయాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుటకు చేయాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు చేయడం జరిగిందన్నారు.ఏకవీర దేవి దేవాలయం చుట్టూ ఫెన్సింగ్ పూర్తయిందని, ప్రధాన ద్వారం, రహదారి ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు తెలుపగా ఇంకను మిగిలి ఉన్న విద్యుత్, మంచినీటి, సూచిక బోర్డులు, గ్రామంలోని విగ్రహాలను సేకరించడం వంటి పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రపంచ పర్యాటక దినోత్సవం అయినా సెప్టెంబర్ 27 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ ఈ రాంప్రసాద్, ఈఈ కిరణ్ కుమార్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు, ఎస్ ఇ ఎన్పిడిసిఎల్ గౌతమ్ రెడ్డి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, కుడా పిఓ అజిత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారద కుడా చైర్మన్ ఇనగల వెంకటరామిరెడ్డి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఉర్స్ గుట్ట వద్దగల రంగ సముద్రం చెరువును పరిశీలించి పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయుటకు తగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కుడా అధికారులను ఆదేశించారు. నగర ప్రజలు సాయంత్రం వేళల్లో సేద తీర్చుటకు గాను రంగసముద్రం చెరువు నకు రోడ్డు వెంబడి ఆసుకొని రోడ్డువైపు వాకింగ్ ట్రాక్, సీటింగ్, తదితర ఏర్పాటు చేస్తూ రంగసముద్రం చెరువు నుండి రంగాలీల మైదానం వరకు అనుసంధానం చేస్తూ రంగాలీల మైదానంలో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.



# రాష్ట్రాభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన నేత వైఎస్ఆర్

**వేద న్యూస్, చొప్పదండి :**

దివంగత మహానేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16 వ వర్ధంతి సందర్భంగా చొప్పదండి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు నిజానపురం చందు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్రాభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని పేదలకు ఉచితంగా వైద్యం అందాలన్న ఉద్దేశ్యంతో ఆరోగ్య శ్రీ పథకం, 108 అంబులెన్స్ సేవలను ప్రారంభించడమే కాకుండా విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ పథకం ద్వారా ఎందరో జీవితాల్లో వెలుగులు నింపి చరిత్ర సృష్టించారన్నారు. కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంతో పాటు కేంద్రంలో కూడా అధికారంలోకి రావడానికి ఆయన చేసిన కృషితో కాంగ్రెస్ కార్యకర్తల గుండెల్లో దేవుడిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, ఆత్మ ఛైర్మెన్ గుర్రం రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరుమాండ్ల గంగయ్య, నాయకులు ముద్దం తిరుపతి, గుర్రం రమేష్, శంకర్, సుధాకర్, మల్లేశం, రవీందర్, తిరుపతి రెడ్డి, సత్యం, చందు, గుంటి స్వరూప, శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ ఇర్ల స్వామి, పత్తిపాక నరేష్, చుప్ప శ్రీనివాస్, గోస్కుల కొమురెల్లి, గ్రామ శాఖ అధ్యక్షులు సత్తు శ్రీనివాస్, గడమల్ల గంగారం, కనుమల్ల రాజశేఖర్, ఆకుల సురేష్, బొడిగే తిరుపతి, పాలూరి ప్రసాద్, జహంగీర్, బుస భీమయ్య, యమ తిరుపతి, గడుగు నరేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# అన్నదానం..మహాదానం

**వేద న్యూస్,వరంగల్ టౌన్:**



గణపతి నవరాత్రుల ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని ఆటో నగర్ లోని శ్రీ లక్ష్మి గార్డెన్స్ ఎదురు గల బాల గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నదాతలు ముద్దు రాజు–శారదా కుటుంబం సభ్యులు అన్నదానం నిర్వహించారు. అన్ని దానాలలోకెల్లా అన్నదానం మహాదానమని, భగవంతుడి సన్నిధిలో అన్న ప్రసాద స్వీకరణ ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తుందని అన్నదాతలు వెల్లడించారు. లంబోధరుడు, ఏకదంతుడు, తొలి పూజలు అందుకునే భగవంతుడు బొజ్జ గణపయ్యను.. అందరికీ సిద్ధి, బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలో హాయిగా భగవంతుడిని తలుచుకోవడం, గణనాథుడి స్మరణలో సమయం గడపడం చక్కటి విషయమేనని భక్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాల గణపతి యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక పెద్దలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## – కార్పొరేటర్ విజయశ్రీ సయ్యద్ రజాలి



**వేద న్యూస్, కాజీపేట :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ తీసుకున్న 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం 63వ డివిజన్ లో కళాబృందం ద్వారా స్థానిక డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ సయ్యద్ రజాలి పాల్గొని ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, అలాగే మనం ఉండే పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేనియెడల దోమల కాటుకు గురై మలేరియా, డైయేరియా, డెంగ్యూ వంటి భయంకరమైన వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని మన ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కళాబృందాలు, సభ్యులు, సానిటరీ ఇన్స్పెక్టర్, అధికారులుజవాన్లు, తదితరులు పాల్గొన్నారు.

# యురియా కోసం వచ్చి సొమ్మసిల్లిన రైతు..!



**వేద న్యూస్, గంభీరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రం రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వద్ద ఉదయం నాలుగు గంటల నుండి యూరియా కోసం నిలుచున్న మండల కేంద్రానికి చెందిన మల్లయ్య యూరియా ఇస్తున్నారని తెలిసి వచ్చి లైన్లో నిలబడ్డారు. ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో కింద పడిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న రైతులు ప్రథమ చికిత్స చేయగా, కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకొని వెళ్లారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ గ్యాంగ్ అరెస్ట్

వేద న్యూస్ డెస్క్ : నగరంలో మరో ఆన్‌లైన్ బెట్టింగ్ గ్యాంగ్ గుట్టురట్టైంది. నగర్‌లో అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ రాకెట్‌ను టాస్క్ ఫోర్స్ (సౌత్) టీమ్ సోమవారం అరెస్ట్ చేసింది. నిషేధిత ఖేలో గేమ్స్ బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తున్న ముఠాకు సంబంధించిన ఎనిమిది మందిని అరెస్టు చేసింది. ఈ ముఠా ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం పలు రకాల మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగిస్తోంది. మారు వ్యక్తుల పేర్లతో యూజర్ ఐడీలు, బ్యాంక్ ఖాతాలను సృష్టించి జోరుగా దందా నిర్వహిస్తున్నారు. అరెస్టయిన నిందితులను జి వినయ్ కుమార్, ఎన్ సాయి వర్ధన్ గౌడ్, డి రాహుల్, డి జెశ్వంత్ తేజ, వేణు గోపాల్, కె రామ్, వేల్పుల ఆకాష్, డి ప్రణయ్‌గా గుర్తించారు. మరో ఇద్దరు కీలక నిందితులు కరీంనగర్‌కు చెందిన రాజేష్, అస్లాం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వేద న్యూస్
బుధవారం సెప్టెంబర్ 03, 2025


# సంపాదకీయం

సాగు ఎంత పెరిగినా..
రైతు జీవితం బాగుపడదా?

వ్యవసాయ రంగంలో వరుస సంస్కరణలు, రైతు కేంద్రిత చర్యలతో ఈ రంగం స్థిరంగా ఎదుగుదల సాధిస్తూ వరి, గోధుమ, మొక్కజొన్న, వేరు సెనగ, సోయాబీన్ వంటి పంటల్లో రికార్డు ఉత్పత్తిని సాధించింది.వ్యవసాయ మాంద్యం, ఆహార కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న స్వాతంత్ర్యానంతర భారతావని హరిత విప్లవ ప్రభావంతో ఆహార భద్రత సాధించ గలిగింది. అలాగే ఉద్యాన పంటల ఉత్పత్తి, పశు సంవర్ధన, క్షీర విప్లవం, నీలి విప్లవం వలన భారతదేశం గణనీయ అభివృద్ధి సాధించింది. ప్రపంచ పాల ఉత్పత్తిలో 25 శాతం భాగస్వామ్యంతో అగ్ర స్థానంలో, ఆక్వాకల్చర్‌లో మూడవ స్థానంలో భారత్ కొనసాగుతోంది. 2025లో ప్రపంచంలో రెండవ పెద్ద మత్స్య ఎగుమతి దారుగా మారింది. అయితే సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీ నివేదిక ప్రకారం వ్యవసాయం గిట్టుబాటు కాక 76 శాతం మంది రైతులు సాగును వదలి ఇతర ప్రత్యామ్యాయ ఉపాధి మార్గాలలోకి మళ్లాలని భావిస్తున్నారు. ఇందుకు గల కారణాలు.. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు, చీడ పీడల వలన దిగుబడులు తగ్గడం, నానాటికీ ఎగబాకుతున్న సాగు ఖర్చులు, పండించిన పంటకు మద్దతు ధర దక్కని పరిస్థితి, భరోసా కల్పించని ప్రభుత్వ విధానాలు, వెంటాడుతున్న రుణ భారం లాంటి కారణాలు దశాబ్దాల తరబడి వేధిస్తుండటంతో రైతాంగం నష్టాల సాగు కొనసాగించలేక కాడి పడేస్తున్నారు. గడచిన మూడు దశాబ్దాలుగా దేశీయంగా సాగు భూముల నికర విస్తీర్ణం 14 కోట్ల హెక్టార్ల దగ్గరే నిలిచిపోయింది. ఇది మరింత తగ్గే అవకాశం ఉంది. ఎన్ఎస్ఎస్ నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా యాభై శాతం రైతులపై సగటున రూ.74 వేల రుణభారం ఉంది. ఆరుగాలం శ్రమిస్తున్నా ఫలితం లేక, అప్పులు తీర్చే దారి కానక గత పదేళ్లలో లక్ష మందికి పైగా అన్నదాతలు బలవన్మరణం పాలయ్యారు. క్షీణిస్తున్న రైతుల ఆదాయాలు, పెరుగుతున్న గ్రామీణ రుణభారం భారతీయ వ్యవసాయాన్ని వెనక్కి లాగుతున్నాయి. భారత్ సంపన్న రాజ్యంగా ఆవిర్భవించాలన్న భారతావని స్వప్నం నిజం కావాలంటే ముందుగా సుమారు 46 శాతం దేశ జనాభాకు ఉపాధి కల్పిస్తున్న సాగు రంగం లాభసాటి కావాలి. సేద్యం లాభదాయకం అవుతున్న కొద్దీ యావద్దేశం ఆర్థికంగా పురోగమిస్తుంది. ఆర్థిక సర్వే ప్రకారం భారత జీవీఏ (స్థూల విలువ జోడింపు)లో వ్యవసాయ, అనుబంధ రంగాల వాటా 2011-12 నుంచి 2023-24 మధ్య 225 శాతానికి పెరిగింది. గత ఐదేళ్లుగా దేశ వ్యవసాయాభివృద్ధి సగటు రేటు 3.5 శాతం. ఆహార ధాన్యాల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. కానీ రైతుకు ఒరిగింది మాత్రం శూన్యం. భూమి విలువతో పాటు అన్ని రకాల ఖర్చులు లెక్కించి, ఆ మొత్తానికి 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధర ఇవ్వాలన్న స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయకుండా కేవలం కొన్ని పంటలకు మాత్రమే హేతుబద్ధత లేని ఎంఎస్‌పి ప్రకటించి ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటున్నాయి. ద్రవ్యోల్బణానికి తగినట్లు రైతుల ఆదాయాలు పెరగలేదని వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ తెలిపింది. ఉపాధి కల్పన, గ్రామీణ జీవనోపాధిలో సాగురంగం కీలకంగా ఉన్న వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడం అత్యంత ఆవశ్యకం. వివిధ వ్యవసాయ ఉత్పత్తుల్లో భారతదేశం అగ్రస్థానంలో ఉన్నప్పటికీ హెక్టారుకు వచ్చే సగటు ఉత్పత్తి, ఉత్పాదకతలో మాత్రం అట్టడుగున ఉంది. జన్యు మార్పిడి పంటలు, ఏఐ సాయంతో ఈ పరిస్థితి అధిగమించి అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా సగటు ఉత్పాదకతను సాధించవచ్చు. వ్యవ సాయంలో తాజా ఆవిష్కరణలు, నూతన వ్యవసాయ విధానాలు, ఫలప్రదమైన నూతన వంగడాల అభివృద్ధి వలన ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతోంది. అలాగే సాగులో ఖర్చులను, ప్రతికూలతలను తగ్గించడంలో, వనరుల సమర్ధ నిర్వహణలో అవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), డేటా విశ్లేషణ ఇప్పుడు వ్యవసాయ రంగాన్ని కూడా విప్లవాత్మకంగా మార్చుతున్నాయి. మహారాష్ట్రలోని బారామతి రైతులు మైక్రోసాఫ్ట్ కంపెనీతో జతకట్టి ఏఐ సాయంతో ప్రయోగాత్మకంగా చేపట్టిన చెరకు సాగు రైతు లోకానికి మార్గదర్శకంగా మారింది. దీని వలన పెట్టుబడి ఖర్చు సగానికి సగం తగ్గిపోగా దిగుబడి 30 శాతం పెరిగింది. అందుకే సాగు రంగంలో సుమారు 90 శాతం ఉన్న చిన్న కమతాలను డిజిటల్ సేద్యంలోకి తీసుకురావాలి. ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని ప్రధాన వృద్ధి చోదకాలలో మొదటిదిగా పేర్కొని ప్రత్యేక కేటాయింపులు చేశారు. ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం ద్వారా దేశంలో వ్యవసాయంలో వెనుకబడిన వంద జిల్లాలలో సేద్యాన్ని అభివృద్ధి చేయడం ద్వారా 1.7 కోట్ల రైతులకు సహాయపడాలని, వీటి పరిధిలోకి రాని వర్షధార సేద్య ప్రాంతాలకు సాగునీటి సరఫరా, ఆధునిక సాంకేతికతలను అందించడం ద్వారా పంట దిగుమతులను పెంచాలని ప్రభుత్వం లక్ష్యిస్తోంది. దేశీయంగా డెబ్బై రకాలకు పైగా పంటల సాగుకు వీలున్నప్పటికీ 85శాతం భూముల్లో ఇరవై రకాలనే పండిస్తున్నారు. ప్రభుత్వం సాగు పరిశోధనలపై వెచ్చించే ప్రతి రూపాయికి రూ.13.85 ప్రతిఫలం వస్తుందని అనేక అధ్యయనాలు చాటాయి. అయినప్పటికీ ఈ రంగంపై ప్రభుత్వ ఖర్చు తక్కువే. ఏటా రూ.5 లక్షల కోట్ల చొప్పున రానున్న ఐదేళ్లు నిధులు కేటాయిస్తే గాని నిజమైన అభివృద్ధి సాకారమై గ్రామీణుల జీవితాలు మెరుగుప డవన్న ఆర్థిక వేత్తల సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు, నాణ్యమైన పరిశోధనలు, రైతు మద్దతు, పర్యావరణానికి అనుకూలమైన విధానాలతోనే భారతదేశం సమ్మిళిత అభివృద్ధి సాధించి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోగలదు.

# పీపుల్స్ లీడర్ వైఎస్ఆర్

**వేద న్యూస్, హుజురాబాద్ ప్రతినిధి:**



దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు ఇల్లందకుంట మండల పార్టీ అధ్యక్షులు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం నాయకులు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్యుడిగా సేవలు ప్రారంభించి.. ఎంతో గొప్ప పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఒక రూపాయికే వైద్యం అందించి.. పేద ప్రజలకు వైద్యం అందించిన గొప్ప వ్యక్తి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని చెప్పారు.

1978 లో రాజకీయాల్లో ప్రవేశించి ఎమ్మెల్యేగా, ఎంపీగా, ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారనీ వెల్లడించారు. వైయస్ "పీపుల్స్ లీడర్"గా పేరుగాంచారనీ స్పష్టం చేశారు. 1999-2004లో ఆంధ్రప్రదేశ్ లీడర్ ఆఫ్ అపోజిషన్‌గా ఎంతో చురుకైన పాత్ర పోషించి.. పాదయాత్ర ద్వారా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారని గుర్తు చేశారు. ఫ్రీ ఎలక్ట్రిసిటీ (రైతులకు మొదటే రోజు నుంచి), "రాజీవ్ ఆరోగ్యశ్రీ" మెడికల్ స్కీం, ఇందిరమ్మ హౌసింగ్, పింఛన్ల పెంపు, ఫీ రీయంబర్స్మెంట్, 108, మొదలైన పలు గొప్ప సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని అన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపిన శాంతి దూత కూడా ఆ మహానేతనే అని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఇల్లందకుంట రామాలయ దేవస్థానం చైర్మన్ ఇంగిలేరామారావు మార్కెట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి, గూడపు సారంగపాణి, కనుమల్ల సంపత్, ఎక్కేటి సంజీవరెడ్డి, కనుమల్ల రామకృష్ణ, వంగ రామకృష్ణ, పెద్ది శివకుమార్, గుడిశాల పరమేశ్వర్, బొమ్మ శ్రీనివాస్, మూడెత్తుల మల్లేష్, మోతేమహేందర్ , మీసా రాజయ్య, మరి వీరారెడ్డి, మేడద తిరుపతిరెడ్డి, మూరెడ్ల రమేష్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదు

- **ఆమె సస్పెన్షన్ బీఆర్ఎస్ అంతర్గత వ్యవహారమని వ్యాఖ్య**
- **అవినీతి సొమ్ము పంపకాలలో తేడాతోనే కవిత వ్యాఖ్యలు చేశారన్న టీపీసీసీ చీఫ్**
- **పదేళ్ల బీఆర్ఎస్ పాలన అవినీతిని ఆమె బయటపెట్టాలని డిమాండ్**

వేద న్యూస్ డెస్క్ : ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని, ఆమె అవసరం తమ పార్టీకి ఏమాత్రం లేదని తేల్చి చెప్పారు. కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడం పూర్తిగా ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని, దానితో తమకు సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ కవిత చేసిన తాజా వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి సొమ్ము పంపకాల్లో తేడాలు రావడం వల్లే ఇప్పుడు కవిత ఆరోపణలు చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి బాగోతాన్ని కవిత పూర్తిగా బహిర్గతం చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు.



తెలంగాణ రాజకీయాల్లో ఇవాళ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై కఠిన చర్యలు తీసుకున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంతో ఆమెను పార్టీ నుంచి తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలోని కీలక నేతలు హరీశ్ రావు, సంతోష్ రావులపై కవిత బహిరంగంగా విరుచుకుపడిన నేపథ్యంలో బీఆర్ఎస్ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే, హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్ కుమార్, మాజీ రాజ్యసభ సభ్యుడు మేఘా కృష్ణారెడ్డిపై కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ప్రతిష్ఠకు వీరే మచ్చ తెచ్చారని ఆమె ఆరోపించారు. కేసీఆర్ చుట్టూ ఉన్న కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పెద్ద కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారని, వారి వల్లే ఇప్పుడు కేసీఆర్ సీబీఐ విచారణను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ఐదేళ్లు నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్ రావుకు ఈ విషయంలో ప్రధాన పాత్ర లేదా?" అని కవిత సూటిగా ప్రశ్నించారు.

# మూడురోజులు భారీ వర్షాలు..

**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుందని.. రాబోయే 24గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపింది. ఆ తర్వాత ఒడిశా మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశాలున్నాయని పేర్కొంది. మంగళవారం ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, జయ శంకర్, భూపాలపల్లి, కామారెడ్డి, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, వరంగల్, వికారాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారం ఆదిలాబాద్, కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని చెప్పింది. గురువారం ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, మల్కాజ్‌గిరి, ములుగు, నారాయణపేట, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, వనపర్తి, వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, హన్మకొండ, వరంగల్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



# బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ..

**వేద న్యూస్ డెస్క్:**

ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, సంతోష్ రావులపై తీవ్రమైన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇవాళ(మంగళవారం) బీఆర్ఎస్ పార్టీ ఆమెను సస్పెండ్ చేసింది. పార్టీ నాయకులతో బీఆర్ఎస్ అధినేత నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కవిత వ్యాఖ్యలపై సుధీర్ఘ చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కవితను సస్పెండ్ చేస్తూ.. పార్టీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇటీవల కాలంలో కవిత ప్రవర్తిస్తున్న తీరు.. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు హైకమాండ్ ఆరోపించింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ పార్టీ నేతలతో మరోసారి భేటీ అయ్యారు. కవిత సస్పెన్షన్ తరువాత పార్టీ తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అయితే ఈ సమావేశంలో కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సంజయ్, మాజీ ఎంపీ వినోద్‌లు పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ భేటీ తరువాత బీఆర్ఎస్ నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. భేటీ అనంతరం బీఆర్ఎస్ నేతలు కవిత సస్పెన్షన్‌పై ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073